# మెరుపు కథలు

## కుక్క చావు

ఛీ! చచ్చేముందు కూడా ఈ ఆలోచనలు ఏమిటి అనుకొన్నాడు వీరేశం. చావాలన్న ఆలోచన అతనికి పాతది కాదు. అయితే ఈసారి చావకపోతే మిగిలే కష్టాల గురించి ఆలోచిస్తున్నాడు. వాటిని నెమరేస్తున్నాడు.

పాత కష్టాలు, భావి కష్టాలు భూదివమ్ముల మధ్య ఊగుతూ కనిపిస్తున్నాయతనికి.

ఉరి కంబాన్ని సమీపిస్తున్న అంత్యకాలపు విరాగిలా నడుస్తున్నాడతను. మిట్ట మధ్యాహ్నం, ఎండా కాలం చెప్పుల్లేని కాళ్ళని తారు రోడ్డు చుర్రుమనిపిస్తోంది. దాహంతో నాలుక వెనక్కి పోతోంది. సగం ప్రాణం చచ్చిపోయింది. మిగతా సగం చస్తే ఆత్మహత్య పూర్తవుతుంది.

చౌరస్తా దాటాడు. ఇంకో రెండు ఫర్లాంగులు నడిస్తే రైలు కట్ట వస్తుంది. సినిమా బోర్డుల కేసి చూసి వేదాంతిలా నవ్వుకున్నాడు. తను ఇంకా కొద్ది నిమిషాల్లో చస్తానన్న ఆలోచన ఎంతో బాగుంది.

అవును మరి. ఇప్పటికే రమారమి ముప్పయ్యేళ్ళు బాగు అంటే ఏమిటో తెలీకుండా బతికేశాడు.

క్లాత్ స్టోరు వైపూ, మాటలు కొట్టిపోస్తున్న గుమాస్తాల వైపూ చూసి నవ్వుకున్నాడు. రీసెంటుగా తను చేసిన వృత్తిని చూసి నవ్వుకున్నట్టే ఉంది.

అయ్య తనని బళ్ళో వేసిన నాటి నుంచీ అన్నీ కష్టాలే. పంతులుగారు చెప్పిన పాఠం మాష్టారుగాని [illegible] చెయ్యిని మొద్దుబార్చిన ఆ బెత్తం ఇప్పటికీ తనకి గుర్తొస్తుంది.

చేతుల వైపు మరోసారి చూసుకుని నవ్వుకున్నాడు కసిగా.

ఎదురుగా ఓ చిరునవ్వు తారసపడింది. ఆయన తనకి పరిచితుడు. ఏమైనా బాకీ ఉన్నానేమోనని గుర్తుచేసుకోసాగాడు. నిన్ననే జీతం తీసుకొని బాకీ అన్నీ తీర్చేశాడు.

ఇప్పుడు తనెవరికీ బాకీలేడు- తల్లిదండ్రులకి తప్ప. మరి ఈ మనిషెందుకిలా చిరునవ్వు చిందిస్తున్నాడు?

వీరేశం ఎవరితోనూ మాట్లాడదలచుకోలేదు. గదిలో తనకు గుర్తొచ్చిన అందరితోనూ మాట్లాడేశాడు. ఉత్త బతుకుని వదిల్చని తన్నిన సంఘటనల్ని తలచుకొని ఏడ్చేశాడు.

అటువంటి సంఘటనలు ఒకటీ అరా కావు కాబట్టి ఆత్మహత్య ముహూర్తంకు మధ్యాహ్నానికి వాయిదా పడింది.

రైలుకట్ట కంటికి కన్పిస్తోంది. అడుగుల వేగం పెరిగింది. సర్కారు ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయమది.

జీవితంలో ఎవర్నీ తను పల్లెత్తు మాట అనలేదు. ఎన్ని తిట్లో పడ్డాడు. పల్లెటూర్నుంచి పారిపోయొచ్చిన కొత్తలో పేగులు మాడిపోతున్నా ఎవరినీ దేవురించలేదు. కొన్నాళ్ళు హోటల్లో పని చేశాడు. ఎన్ని దెబ్బలో తిన్నాడు. రెండు పూటలా తిండి తింటున్నప్పుడు అమ్మా నాన్నలు గుర్తొచ్చి బాధ పడేవాడు. కానీ ఎప్పుడూ ఏడ్వలేదు. కానీ చచ్చిపోయేముందు ఎందుకిలా ఏడ్చేశాడు.

రైలు పట్టాలమీదకి చేరుకొన్నాడు.

దూరంగా కుక్క అరుపు విన్పించింది.

ఘోరంగా చావాలి. నెత్తురు కక్కుకొంటూ చావాలి. చిన్నప్పట్నుంచీ తనకి అప్పుడప్పుడు కలుగుతున్న బలీయమైన ఆ కోర్కె నెరవేరబోతోంది.

దూరంగా స్టేషన్లో రైలు కూత.

ఆ ప్రాంతంలో పిచ్చి కుక్కలుంటాయని ఆ వైపు ఎవరూ రారు. అందుకే వీరేశం ఆ మార్గం ఎంచుకొన్నాడు.

రైలు కూత మళ్ళీ విన్పించలేదు. కుక్క అరుపు పెద్దదయింది. పక్కకి తిరిగి చూశాడు- రైలు పట్టాల మధ్యనున్న దూలం మీద నుంచి కాలు జారిపోయింది. కుక్క దగ్గరికొచ్చింది. సందేహం లేదు- పిచ్చికుక్కే. మూతి వంకర్లు తిప్పుతోంది. వీరేశం భయపడలేదు.

తనకి కుక్కకి మధ్య గజం దూరమే. మీదికి ఉరకబోతుంది. పళ్ళు కోరల్లా ఉన్నాయి. ఏదైతేనేం చావేకదా కావలసింది అనుకొన్నాడు. అయినా కాలు వెనక్కి వేస్తున్నాడు. కుక్క ముందుకొచ్చేస్తోంది. అయినా ఇన్నేళ్ళు బతికి కుక్కచేతిలో చావడమా అనుకున్నాడు.

దూరంగా రైలు మరోసారి కూతేసింది. మెరుపులా ఒక రాయందుకొన్నాడు. ఈ రాయితో తనని తను రక్షించుకోగలడా? ఉన్మత్త జాగిలం ఉగ్రమైపోయింది. చావాలని వచ్చి ఈ ప్రతిఘటన ఏమిటని కూడా అనుకున్నాడు. పిడికిళ్ళు సడలిపోతున్నాయి ఇప్పుడు. తనని కుక్క పీకేస్తుంది. తర్వాత రైలు కింద పచ్చడైపోవచ్చు. మనసులో ఆటు పోటులు. ఇంతలో భయంకరమైన అల.

కుక్క మీదికి బలంగా రాయి విసిరాడు. నాలుగడుగులు వెనక్కేసిన కుక్క మళ్ళీ ముందుకురికింది. అప్రయత్నంగా ఇనుప కమ్మి అందుకొన్నాడు. జీవితంలో ఈ ఒక్కసారైనా ఓడిపోకూడదనుకొన్నాడు. పక్క దిగువన ఇన్నాళ్ళు దాచుకొన్న కన్నీళ్ళని పొద్దున గదిలో కార్చేసినట్టే అంతరాంతరాల్లో దాగి ఉన్న పౌరుషం ఇనుప కమ్మికి తోడైంది. పిచ్చికుక్క మెడ మీద బలంగా బాదాడు- అలా కొడుతూనే ఉన్నాడు.

రైలు కూత దగ్గర పడింది. ఇప్పుడు తను చావొచ్చు.

రైలు పాతిక గజాల దూరంలో ఉంది.

కానీ అతను చావలేదు. ఇనుమడించిన ఉత్సాహంతో వెనుదిరిగాడు.

ఆత్మహత్య చేసుకోవాలని వీరేశానికి మరెప్పుడూ అన్పించలేదు. ●

శాంతారామ్